క్లుప్తంగా

హక్కులను పోరాడి సాధించుకోవాలి



మంగళగిరి: హక్కుల ఉద్యమాన్ని బలోపేతం చేయడం ద్వారానే ప్రజలు తమ జీవితాలను మెరుగుపరచుకోగలుగుతారని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.చిట్టిబాబు తెలిపారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో పౌరహక్కుల సంఘం గుంటూరు జిల్లా 20వ మహాసభలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ ఆధిపత్య శక్తులు, ప్రభుత్వ అణిచివేత చర్యలు నుంచి అణిచివేతకు గురయిన వారు ఉద్యమించాల్సిన అవసరముందని చెప్పారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు డాక్టర్ వీరేశలింగం, విప్లవ రచయితల సంఘం నాయకులు సీఎస్ఆర్ ప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్ మధుబాబు, వక్తలు మంజుశ్రీ, షేక్ నాగూర్‌వలి, సిహెచ్ కోటేశ్వరరావు, వి.ప్రభాకర్, ఎస్.నరసింహారావు పాల్గొన్నారు.

ప్రభువు ఆరాధనతోనే అద్భుతాలు

ఫిరంగిపురం: ప్రభువు ఆరాధనతోనే అద్భుతాలు సాధ్యమని బాల ఏసుదేవాలయ విచారణ గురువులు పామిశెట్టి బాలస్వామి అన్నారు. మండల కేంద్రంలోని బాల ఏసుదేవాలయంలో తపస్సుకాల ప్రార్థనలలో భాగంగా ఆదివారం ఐదో రోజు ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన వాక్యోపదేశం చేస్తూ తపస్సు కాలంలో ప్రతిఒక్కరూ భక్తి మార్గంలో ప్రయాణించాలని చెప్పారు. నిత్యం క్రీస్తును ధ్యానం చేయడం ద్వారా భక్తి భావం పెరుగుతుందని తెలిపారు. అనంతరం ఆలయం లోపల ఉన్న 14 స్థలాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కత్తి పద్మారావుకు సన్మానం



మంగళగిరి: దళితులు, బడుగు బలహీనవర్గాల అభివృద్ధి కోసం తన రచనలతో తన జీవితాన్ని జాతికి అంకితం చేసిన కత్తి పద్మారావు అభినందనీయుడని ఏపీ ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంఘం ప్రతినిధులు కొనియాడారు. తాడేపల్లిలోని కార్యాలయంలో కత్తి పద్మారావును ఆదివారం అధికారులు సంఘం ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ఎం.సునీల్ కుమార్, కొత్తపల్లి వెంకటర మణ, భాస్కర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మొక్కలు పంపిణీ

మంగళగిరి: పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా మొక్కలు పంపిణీ చేస్తున్నట్లు పచ్చదనం..పరిరక్షణ బృందం ప్రతినిధి ఆకురాతి కోదండ రామయ్య తెలిపారు. ఆదివారం మిద్దె సెంటర్‌లో పచ్చదనం..పరిరక్షణ బృందం ఆధ్వర్యంలో ప్రజలకు మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు జగన్నాథ శ్రీనివాసరావు, గోలి నరసింహారావు పాల్గొన్నారు.

నేడు 'గుడ్ మార్నింగ్ మంగళగిరి'

మంగళగిరి: పట్టణంలోని శ్రీ లక్ష్మీనృసింహ స్వామి కాలనీలో గుడ్ మార్నింగ్ మంగళగిరి కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ ఆకురాతి రాజేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 7.30 గంటలకు ప్రారంభమయ్యే గుడ్ మార్నింగ్ మంగళగిరి కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి పాల్గొంటారని, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

దుకాణంలో చోరీ

మంగళగిరి: నగర పరిధిలోని ఉండవల్లి సెంటర్‌లో చోరీ ఘటన చోటుచేసుకుంది. తాడేపల్లి పోలీసులు తెలిపిన వివరాలు.. ఉండవల్లి సెంటర్‌లోని వెన్నెల సూపర్ మార్కెట్‌లో శనివారం రాత్రి దుండగులు మార్కెట్ స్లాబుకు ఉన్న రేకులు కట్ చేసి లోపలికి చొరబడ్డారు. మార్కెట్‌లోని రూ.10 వేల నగదుతో పాటు సరకులు దోచుకుని వెళ్లారు. ఆదివారం ఉదయం మార్కెట్ యజమాని వెంకటేశ్వరరావు మార్కెట్ తెరచి చూసి చోరీకి గురయినట్లు తెలుసుకుని తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కోడి పందెం రాయుళ్ల అరెస్ట్

కంతేరు(తాడికొండ): కోడి పందేల స్థావరాలపై తాడికొండ పోలీసులు నిర్వహించిన దాడులలో పలువురు పట్టుబడిన ఘటన తాడికొండ మండలం కంతేరు గ్రామ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ సీహెచ్ ప్రభాకర్ తెలిపిన వివరాలు.. కంతేరు శివారు రైల్వే ట్రాక్ సమీపంలోని పొలాల్లో కోడి పందేలు నిర్వహిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు దాడులు చేయగా 13 మంది వ్యక్తులు, 2 కోళ్లు, 9 వాహనాలు, రూ.20,700 స్వాధీన పర్చుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సోమవారం వీరిని కోర్టులో హాజరు పరచనున్నట్లు సీఐ తెలిపారు.

సామాన్యులకు అందుబాటులో..

- కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం
- తొమ్మిది భవనాలకు రూ.9.20 కోట్ల ఖర్చు



రాజీవ్ గృహకల్ప వద్ద పూర్తిచేసుకున్న రజక సామాజిక భవనం



నగర పరిధిలోని నీరుకొండ దళిత శిబిరంలో నిర్మాణం పూర్తి చేసుకున్న కమ్యూనిటీ హాల్



మంగళగిరి: పెళ్లి, పేరంటం ఏదైనా ఫంక్షన్ హాల్‌లో తప్పనిసరి అయింది. మధ్య తరగతి నుంచి పెద్దల తమ స్థాయిని బట్టి ఫంక్షన్ హాళ్లు పల్లెల నుంచి పట్టణాల వరకు అందుబాటులోకి వచ్చాయి. అయితే పేదలు ఫంక్షన్ చేసుకోవాలంటే ఖర్చు తడిసిమోపెడవుతోంది. దీంతో అప్పులపాలు అయ్యే అవకాశం ఉంది. నగరంలో ఏ ఫంక్షన్ హాల్, కళ్యాణ మండపాలు, కన్వెన్షన్‌లు చూసినా అద్దె, కరెంట్ బిల్లు, ఖర్చువు వెరసి తక్కువలో తక్కువ సుమారు రూ.2 లక్షలు కాక తప్పడం లేదు. ఇక పెద్ద కన్వెన్షన్ హాల్స్ అయితే రూ.7 నుంచి రూ.15 లక్షల వరకు అద్దెలుండడంతో సామాన్యులు వెళ్లే పరిస్థితి లేదు.

పేదల కోసం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆయా సామాజిక వర్గాల వినతులను పరిగణలోకి తీసుకుంది. అక్కడ అందుబాటులో ఉన్న స్థలాన్ని బట్టి నిధులు కేటాయించింది. ఆ విధంగా మంగళగిరి– తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో సుమారు తొమ్మిది సామాజిక భవనాల నిర్మాణలు చేపట్టింది. అందుకుగాను ఇప్పటి వరకు రూ.9.25 కోట్లు ఖర్చు చేశారు. వాటికి కూడా మహనీయుల పేర్లు పెట్టారు. వీటిని త్వరలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఫంక్షన్ హాల్ ప్రాంతం	ఖర్చు
బాప్టిస్ట్ పేట	రూ.75 లక్షలు
నీరుకొండ	రూ.1.50 కోట్లు
రాజీవ్‌గృహ కల్ప	రూ.90 లక్షలు
రజక కమ్యూనిటీ హాల్	రూ.90 లక్షలు
తాడేపల్లిలో...	రూ.1.20 కోట్లు
సగరుల కమ్యూనిటీ హాల్	రూ.80 లక్షలు
గౌడ కమ్యూనిటీ హాల్	రూ.90 లక్షలు
కుంచనపల్లిలో	రూ.1.50 లక్షలు
ఇప్పటంలో	రూ.80 లక్షలు

కమ్యూనిటీ హాల్‌తో ఖర్చు తగ్గింది



పేద మధ్య తరగతి వర్గాలు తమ ఇంట్లో చిన్న ఫంక్షన్ చేసుకోవాలన్నా ఫంక్షన్ హాల్స్‌కి వెళ్లే లక్షలు అద్దెలు చెబుతున్నారు. అద్దెలు భరించలేక ఇంటి ముందు రోడ్డు మీద టెంట్‌లు వేసుకుని అటుగా వెళ్లే వారితో మాటలు పడుతూ ఫంక్షన్ చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కార్పొరేషన్ ఆధ్వర్యంలో పేదలు ఫంక్షన్‌లు జరుపుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారని గమనించి అన్ని సామాజిక వర్గాలకు కమ్యూనిటీ హాల్స్ నిర్మించడం సంతోషకరం. హాల్స్‌తో అతి తక్కువ ఖర్చుతో ఆనందంగా జరుపుకునేలా ప్రభుత్వం సామాజిక భవనాలు నిర్మించడం అభినందనీయం.

– కురగంటి మేరీ విజయమణి, నీరుకొండ

పేదల ఇబ్బందులు తప్పాయి



అన్ని సామాజిక వర్గాలు తమ ఇంట్లో శుభకార్యం సంతోషంగా జరుపుకోవాలనే లక్ష్యంతో కమ్యూనిటీ హాల్స్ నిర్మించడంతో పేదలు ఎలాంటి ఇబ్బంది లేకుండా అప్పులు చేయకుండా సంతోషంగా శుభకార్యాలు నిర్వహించుకునే అవకాశం లభించింది. మంగళగిరిలో రెండు ఎస్సీ సామాజిక వర్గాలకు రెండు కమ్యూనిటీ హాల్స్ నిర్మించడం హర్షణీయం. పేదలు చిన్న ఫంక్షన్ నిర్వహించుకోవాలన్నా లక్షల్లో అద్దెలకు ఖర్చు చేయాల్సి వస్తుంది. హాల్స్ నిర్మాణంలో అతి తక్కువ ఖర్చుతో ఫంక్షన్ జరుపుకునేలా భవనాలు నిర్మించడం అభినందనీయం.

– ఉప్పు మహేష్, మంగళగిరి

కాజ పుల్లయ్య చెరువులో ఆక్రమణల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్



కాజ పుల్లయ్య చెరువులో ఆక్రమణలను తొలగిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

మంగళగిరి: నగరంలో చెరువులను సుందరంగా తీర్చిదిద్ది ప్రజలకు తాగునీటి కొరత లేకుండా చేయడంతో పాటు వాకింగ్ ట్రాక్‌లు నిర్మాణం చేసి చెరువుల చుట్టూ కట్టలపై మొక్కలు నాటి ప్రజలకు ఆహ్లాదం ఆరోగ్యం అందించేలా కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో నగర పరిధిలోని కాజలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు చెరువు కట్టలను తొలగించి ఆక్రమణలకు తెగబడ్డారు. మూడు రోజుల క్రితం రాత్రికి రాత్రే చెరువులో పేదల ముసుగులో గుడిసెలు వేసి ఆక్రమణకు తెగబడ్డారు. చెరువు ఆక్రమణపై 'సాక్షి'లో ఈ నెల 16వ తేదీన చెరువును వదలని పచ్చ బ్యాచ్ అంటూ కథనం ప్రచురితమైంది. దీంతో ఆక్రమణదారుల గుండెల్లో ఎలక్కాయపడ్డట్లయింది. సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనంతో స్పందించిన కార్పొరేషన్ అధికారులు చెరువులోని ఆక్రమణలు తొలగింపు చేపట్టారు. కార్పొరేషన్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ పర్యవేక్షణలో సిబ్బంది ఆదివారం చెరువులోని ఆక్రమణలను తొలగింపు చేపట్టారు. దీంతో పచ్చ బ్యాచ్ ఆక్రమణలకు అడ్డుకట్టపడింది. కమిషనర్ నిర్మల్ కుమార్ మాట్లాడుతూ నగరంలోని పలు చెరువును ఆధునికీకరించి మొక్కలు నాటి పచ్చదనంతో కూడిన వాకింగ్ ట్రాక్‌లు నిర్మించి ప్రజలకు ఆహ్లాదం ఆరోగ్యం అందించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. నగర పరిధిలోని కాజ, పెనుమాక, నిడమర్రు, చినకాకాని, నూతక్కి చెరువులను అమృత్ పథకంలో భాగంగా సుందరంగా తీర్చిదిద్ది ప్రజలకు తాగునీటి కొరత లేకుండా చేయడంతో పాటు ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు.

బాధ్యత, స్వీయరక్షణ మెలకువలు పెంచుకోవాలి

చలపతి విద్యా సంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు



మాట్లాడుతున్న వైవీ ఆంజనేయులు

తాడికొండ: వసతి గృహాలలో నివసించే విద్యార్థులకు బాధ్యత, స్వతంత్రత, స్వీయరక్షణ వంటి అలవాట్లు పెంపొందుతాయని చలపతి విద్యా సంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు అన్నారు. మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన హాస్టల్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థి దశలో ఏదో ఒక సమయంలో విద్యార్థులు హాస్టల్‌లో ఉండాల్సిన పరిస్థితి వస్తుందని, ఆ సమయంలో వారు నేర్చుకున్న స్వతంత్ర్య భావాలు జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కోగలిగే సామర్థ్యాన్ని పెంపొందిస్తాయనడంలో సందేహం లేదన్నారు. తమ కళాశాలలో హాస్టల్ విద్యార్థులకు ఉచితంగా ఎన్‌పీ టెల్, వివిధ రకాల సర్టిఫికేషన్స్ కోర్సులు అందిస్తున్నట్లు తెలిపారు. విష్ణు విద్యా సంస్థల డైరెక్టర్, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ బి.రవీంద్ర బాబా మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలలో చదువుతో పాటు లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్‌లను ఉపయోగించుకొని తమ పరిజ్ఞానం పెంపొందించుకోవచ్చన్నారు. ప్రస్తుతం వేగంగా అభివృద్ధి చెందుతున్న కృత్రిమ మేధా, డేటా సైన్స్ రంగాల్లో విషయ పరిజ్ఞానం పెంపొందించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా గుంటూరు హ్యూమర్ క్లబ్ ప్రదర్శించిన హాస్య వల్లరి అందరినీ విశేషంగా అలరించింది. కార్యక్రమంలో చలపతి విద్యాసంస్థల కోశాధికారి వై.అనంతకుమారి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నాగ శ్రీనివాసరావు, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ జయకృష్ణ పాల్గొన్నారు.

వీర్లంకమ్మ ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



దామరపల్లి వీర్లంకమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

దామరపల్లి(తాడికొండ): తాడికొండ మండలం దామరపల్లిలోని వీర్లంకమ్మ తల్లి కొలుపుల సందర్భంగా ఆలయంలో ఆదివారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే, తాడికొండ సమన్వయకర్త మేకతోటి సుచరిత ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో గ్రామస్తులు మహిళలతో కలిసి కొబ్బరికాయ కొట్టి ఆశీర్వచనాలు అందుకున్నారు. కార్యక్రమంలో ఆమె వెంట జెడ్పీటీసీ సభ్యురాలు గుడిమెట్ల జ్యోతి, మాజీ సర్పంచి నల్లిబోయిన శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు బొర్రా వెంకటేశ్వరరెడ్డి, కంతేరు ఎంపీటీసీ వలపర్ల కల్పన, మాజీ ఉప సర్పంచ్ ఖాజా సాంబిరెడ్డి పాల్గొన్నారు.

కోల్డ్ స్టోరేజ్‌లతో రైతులకు మేలు

పొన్నెకల్లు(తాడికొండ): కోల్డ్ స్టోరేజీల్లో పంటలను నిల్వ చేసుకోవడం ద్వారా రైతులకు గిట్టుబాటు ధరలు లభిస్తాయని ఎమ్మెల్యే, తాడికొండ సమన్వయకర్త మేకతోటి సుచరిత అన్నారు. తాడికొండ మండలం పొన్నెకల్లులో నూతనంగా నిర్మించిన రేణుకా కోల్డ్ స్టోరేజీని స్విచ్ ఆన్‌చేసి ప్రారంభించారు. అనంతరం గిడ్డంగులను పరిశీలించి నిర్వాహకులు ఏరువ రామకృష్ణారెడ్డిని అభినందించారు. నరసరావుపేట ఎమ్మెల్యే, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నంబూరు శంకరరావు, మిర్చి యార్డు ఛైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ పాల్గొని నూతన కోల్డ్ స్టోరేజీని పరిశీలించి అభినందించారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక నూతన కమిటీ

ఫిరంగిపురం: ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక నూతన కమిటీ ఎంపిక కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి వేణుగోపాలరెడ్డి పాల్గొని నూతన కమిటీ సభ్యులను ఎంపిక చేశారు. మండల నూతన కమిటీ అధ్యక్షుడిగా అబ్దుల్ రసూల్, ఉపాధ్యక్షుడిగా కె. వీరయ్య, ప్రధాన కార్యదర్శిగా బి.సుబ్బారావు, కోశాధికారిగా మస్తాన్‌వలి, కార్యదర్శులుగా ఎం.శ్రీనివాసరావు, వి.హరిబాబు, కార్యదర్శులుగా పి.విమలకుమారి, జి.మహేంద్ర, కె.ఫ్రాన్సిస్‌లను ఎంపిక చేశారు. అనంతరం మొదటి సమావేశం నిర్వ హించారు. కార్యక్రమంలో రాష్ట్రకోశాధికారి ఎస్.నా గార్జున, జిల్లా కోశాధికారి కె.ప్రసాద్ పాల్గొన్నారు.

కుల మతాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు

ఘనంగా ఖిద్మత్ టీమ్ 5వ వార్షికోత్సవం



నగర వీధులలో ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహిస్తున్న ఖిద్మత్ టీమ్

మంగళగిరి: కుల, మతాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడమే లక్ష్యమని ఖిద్మత్ టీమ్ కన్వీనర్ షేక్ షఫీ అన్నారు. పట్టణంలోని నిడమర్రు రోడ్డులో ఖిద్మత్ టీమ్ ఐదో వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. నగర పురవీధులలో భారీగా యువకులు ద్విచక్ర వాహనాలతో ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా షఫి మాట్లాడుతూ కరోనా సమయంలో మృత దేహాలను ముట్టుకునేందుకు ప్రజలు భయపడుతున్న సమయంలో మృతదేహాలను ఖననం చేయడంతో పాటు ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా ఖిద్మత్ టీమ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఐదేళ్ల ఎన్నో సేవలందించి ప్రజల మన్ననలు పొందడం సంతోషంగా ఉందని చెప్పారు. తాను చేపట్టిన సేవా కార్యక్రమాలలో కుల మతాలకు అతీతంగా యువత ముందుకు వచ్చి పాల్గొనడం అభినందనీయమన్నారు.

పసి'కన్ను'లకు వెలుగులు

- జీజీహెచ్ డైక్ సెంటర్‌లో పసికందులకు పరీక్షలు
- ప్రత్యేక శిబిరం ద్వారా రెటినా పరీక్షలు
- ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తున్న వైద్యులు



పసికందులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



కంటి పరీక్షల కార్డును అందజేస్తున్న ఆప్టోమెట్రీషియన్ ప్రతాప్‌కుమార్



కంటి పరీక్షల కోసం పిల్లలతో వచ్చిన తల్లులు

గుంటూరు మెడికల్: సరేంద్రియాణాం నయనం ప్రధానం అన్నారు పెద్దలు. శరీరంలోని అన్ని అవయవాల్లో నేత్రాలు చాలా ముఖ్యమైనవి. అందమైన ప్రపంచాన్ని కళ్లారా చూడాలంటే మనకు ఎలాంటి దృష్టి సమస్యలు లేకుండా చూపు సక్రమంగా ఉండాలి. అయితే, రెటినోపతి అనే కంటి జబ్బు వల్ల కంటి చూపును కోల్పోతున్నారు. ఈ జబ్బును ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స చేయించటం వల్ల కంటి చూపును పోకుండా కాపాడుకోవచ్చు. అప్పుడే పుట్టిన పసికందుల్లో రెటినోపతి అనే జబ్బు వచ్చి ఏ పాపం ఎరుగని పొత్తిళ్ల చిన్నారులు అంధులుగా మారుతున్నారు. అలాంటి పసికందులకు ఉచితంగా కంటి పరీక్షలు చేయించి కంటి చూపు పోకుండా ప్రభుత్వం కాపాడుతోంది.

డైక్ సెంటర్‌లో ఉచిత కంటి పరీక్షలు

గుంటూరు జీజీహెచ్ ఆవరణలో జిల్లా బాలల సత్వర చికిత్సా కేంద్రం (డైక్)లో నెలరోజుల వయస్సున్న పసికందులకు ఉచితంగా రెటినోపతి పరీక్షలు చేయిస్తున్నారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించి నూతన జీవితాన్ని ప్రసాదిస్తున్నారు. రాజమండ్రికి చెందిన గౌతమి ఐ ఇనిస్టూట్ వారు ప్రతి నెలా రెండుసార్లు గుంటూరు జీజీహెచ్ డైక్ సెంటర్‌లో పసికందులకు ఉచితంగా కంటి పరీక్షలు చేస్తున్నారు. కంటి స్క్రీనింగ్ పరీక్షల్లో ఏదైనా సమస్య ఉన్నట్లు గుర్తిస్తే వారిని తాడిగడప ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి తరలించి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తున్నారు. సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు డైక్ సెంటర్‌లో సిబ్బంది అందుబాటులో ఉండి పసికందుల కంటి సమస్యలతోపాటుగా ఇతర సమస్యలకు సైతం పరీక్షలు చేయించి అవసరమైన వారికి ఉచితంగా లక్షలు ఖరీదు చేసే ఆపరేషన్లు చేయిస్తున్నారు. కంటి సమస్యలపై ఏమైనా సందేహాలు ఉంటే వైద్య సలహాల కోసం డైక్ సెంటర్ ఆప్టోమెట్రీషియన్ బుస్సా ప్రతాప్ కుమార్‌ను 9440144487 నంబర్‌లో సంప్రదించాలి.

ఈ సమస్యలుంటే తప్పనిసరిగా కంటి స్క్రీనింగ్ పరీక్షలు....

డైక్ సెంటర్‌లో పసికందుల్లో రెటినోపతి వల్ల కంటి చూపు కోల్పోకుండా కాపాడేందుకు అవసరమైన స్క్రీనింగ్ పరీక్షలు 2023 డిసెంబర్ నుంచి చేస్తున్నారు. బరువు తక్కువగా పుట్టిన పసికందులకు, నెలల నిండకుండానే పుట్టిన పసికందులకు తప్పనిసరిగా రెటినోపతి పరీక్షలు చేయించాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇలాంటి సమస్యలతో పుట్టే పసికందుల్లో నరాల వ్యవస్థ పూర్తి స్థాయిలో ఏర్పడక కంటి చూపుపై ప్రభావం చూపిస్తుందని వెల్లడించారు. బిడ్డ పుట్టిన 21 రోజుల నుంచి 30 రోజుల్లోపు కంటి స్క్రీనింగ్ పరీక్షలు చేయించటం ద్వారా కంటి చూపును కాపాడుకోవచ్చు. డిసెంబర్ నెలలో 46 మంది, 2024 జనవరిలో 50 మందికి, గురువారం 18 మంది అప్పుడే పుట్టిన నవజాత శిశువులకు కంటి పరీక్షలు చేశారు. ఎలాంటి బిడ్డలకు కంటి పరీక్షలు చేయించాలి, ఎప్పుడు చేయించాలి, ఎలా సమస్యలను గుర్తించాలనే విషయాలపై వైద్యులు, వైద్య సిబ్బందికి శిక్షణ ఇవ్వడం ద్వారా పలువురు జీజీహెచ్‌కు పసికందులను కంటి పరీక్షల కోసం రిఫర్ చేస్తున్నారు.

మా కంటి దీపాన్ని కాపాడారు



డిసెంబర్ 5న రెండో కాన్పులో ట్విన్స్‌కు జన్మనిచ్చా. పసికందు బరువు కేవలం 1.9 గ్రాములు ఉండటంతో జీజీహెచ్ వైద్యుల సలహా మేరకు డైక్ సెంటర్ బిడ్డకు కంటి స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. రెటినోపతి సమస్య ఉన్నట్లు డైక్ సెంటర్ వారు గుర్తించి ఎల్ వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి తరలించారు. వారం రోజుల క్రితం సుమారు లక్ష రూపాయల ఖరీదు చేసే కంటి ఆపరేషన్ చేసి మా బిడ్డ చూపు పోకుండా కాపాడిన వైద్యులకు, ఉచితంగా చేయించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మా ధన్యవాదాలు.

–మాదుగాని ప్రియాంక, గుంటూరు నగరంపాలెం

సద్వినియోగం చేసుకోవాలి



డైక్ సెంటర్ ద్వారా చిన్నారులకు చేస్తున్న రెటినోపతి స్క్రీనింగ్ పరీక్షల కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి. డైక్ సెంటర్ ద్వారా అప్పుడే పుట్టిన పసిబిడ్డల్లో వచ్చే వినికిడి సమస్యలు, ఆటిజం, దృష్టి సమస్యలు, న్యూరాలజీ సమస్యలు, దంతాల సమస్యలు, అభ్యసనా సమస్యలు, తలసీమియా, రక్తహీనత, విటమిన్–డి లోపాలు, పోషకాహార లోపాలు, అయోడిన్ లోపాల సమస్యలు ఇతర సమస్యలకు ఉచితంగా పరీక్షలు చేసి అవసరమైన వారికి ఆపరేషన్లు కూడా చేయిస్తున్నారు. లక్షల ఖరీదు చేసే గుండె ఆపరేషన్లు, కాక్లియర్ ఆపరేషన్లు సైతం ఉచితంగా చేస్తున్నారు. తల్లిదండ్రులు పిల్లల్లో ఉండే సమస్యలను ముందస్తుగా గుర్తించి తక్షణమే డైక్ సెంటర్‌ను సంప్రదించాలి.

–డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, డైక్ సెంటర్ ఇన్‌చార్జి

జాతీయ పోటీల్లో మోహన రూపకు కాంస్యం



గుంటూరు వెస్ట్ (క్రీడలు): కేరళలోని కోజికోడ్‌లో ఈ నెల 16 నుంచి 18 వరకు జరిగిన సీనియర్ నేషనల్స్ ట్రాంపోలిన్ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్‌లో గుంటూరుకు చెందిన మోహన రూపకు కాంస్య పతకం దక్కిందని కోచ్ పఠాన్ అఫ్రోజ్ ఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక బీఆర్ స్టేడియంలోని జిమ్నాస్టిక్స్ సెంటర్లో శిక్షణ పొందిందని పేర్కొన్నారు. మోహన రూప ఇప్పటి వరకు తొమ్మిది నేషనల్స్‌లో ఆడి ఉత్తమ ప్రతిభతో పాటు పలు పతకాలు సాధించిందని తెలియజేశారు.

కేంద్ర పథకాలపై గ్రామాల్లో ప్రచారం

గుంటూరు మెడికల్: కేంద్ర పథకాలపై గ్రామాల్లో వికసిత భారత్ కార్యక్రమం ద్వారా ప్రచారం చేస్తున్నామని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెలవర్తిపాటి పాండురంగ విఠల్ తెలిపారు. ఆయన ఆదివారం గుంటూరు లాల్‌పురం రోడ్డులోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌కు ఇస్తున్న అనేక సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలియజేస్తున్నామని తెలిపారు. గతంలో చలో అభియాన్ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ప్రతి వ్యక్తిని కలిసి కేంద్ర పథకాల గురించి వివరించామని చెప్పారు. నేడు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న పథకాలను వికసిత భారత్ కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకు తీసుకెళ్తున్నామని తెలిపారు. కేంద్రంలో మరోసారి బీజేపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఆయన కోరారు.

మద్యపానంతో కుటుంబాల చిన్నాభిన్నం



గుంటూరు ఎడ్యుకేషన్: కుటుంబాలను చిన్నాభిన్నం చేసే మద్యపానాన్ని విడనాడాలని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి పేర్కొన్నారు. కృష్ణబాబుకాలనీలో కళాశాల ఎన్ఎస్ఎస్–3 విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం ఆదివారం కొనసాగింది. ఈ సందర్భంగా విద్యార్థినులు మద్యపానం, ధూమపానం, మత్తు పదార్థాలు, గుట్కా, పొగాకు వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలని అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. 21వ డివిజన్ కార్పొరేటర్ కె.గురవయ్య మాట్లాడుతూ మద్యపానం వల్ల కుటుంబాలు ఎంతో నష్టపోతాయని చెప్పారు. కార్యక్రమ నిర్వహణ అధికారి కె. సుబ్బరత్నమ్మ మాట్లాడుతూ ప్రస్తుతం యువత ఎక్కువగా డ్రగ్స్, మత్తు కలిగించే ఆల్కాహాల్ వంటి దురలవాట్లకు బానిసలుగా మారి, బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా 50 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు 76వ సచివాలయం సిబ్బందితో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని కోరుతూ అవగాహన కల్పించారు.

అవోపా ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ

గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని ఆర్యవైశ్య అఫీషియల్స్–ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) కార్యాలయంలో ఆదివారం 108 మంది పేదలు, వృద్ధులకు రూ.500 చొప్పున పెన్షన్ పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ కాటన్ వ్యాపారి చందోలు శివరామకృష్ణ ప్రసాద్, హెల్దీ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు మాజేటి రామారావు మాట్లాడుతూ పేదలకు ప్రతి నెలా పెన్షన్లతో పాటు నూతన వస్త్రాలను అందజేయడం మంచి పరిణామమని అన్నారు. వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇవ్వడం అభినందనీయమని పేర్కొన్నారు. అవోపా ద్వారా పేదలను ఆదుకునేందుకు తమ వంతు సహకారాన్ని అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వంకాయల జనార్దనరావు, అవోపా రాష్ట్ర కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, నగర అధ్యక్షుడు కె.వి.బ్రహ్మం, కార్యదర్శి రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, మద్దిసాయి రమేష్, వివాహ వేదిక కన్వీనర్ కంచర్ల వెంకటేశ్వర్లు, రాచపూడి సుబ్బారావు కోటిరత్నం పాల్గొన్నారు.